

# "కరుణ నవ్వింది"

శ్రీ కేశిరాజు సోమేశ్వరరావు

"మనోహర్" అన్నపిలుపు ఆకాశంలో విహరిస్తోన్న అతని మనస్సుకు చురుక్కున తగిలింది. ఉలిక్కిపడి వెనుతిరిగి చూసాడు. గుమ్మంలో నిలబడిఉంది కరుణ. రమ్మనమని సైగచేసింది.

చలిగాలి విసిరివిసిరి కొడుతూంది. శరీరమంతా ముడుచుకుపోతోంది. గగనంలో మెరుపుతీగలు మెరుస్తున్నాయి. నల్లని మబ్బులు జట్లుజట్లుగా నీలాకాశంలో పరుగెడుతున్నాయి. కొద్ది సేపట్లో చినుకులు పడేటట్లుంది, అరిచేతులు గట్టిగా రుద్దుకొని అటూ ఇటూ చూసి తిన్నగా ఇంట్లో ప్రవేశించాడు.

టేబిల్ ముందున్న కుర్చీలో కూర్చుని "గృహలక్ష్మి" తిరగేస్తోంటే కరుణ అతని దగ్గరగావచ్చి నిలచింది.

"మీ అమ్మగారు ఇంట్లో లేరా" అన్నాడు మనోహరు. "లేదు. డాక్టరు గారింటికి వెళ్లింది." సన్నగా అంది కరుణ. ఆమె ముఖం దుఃఖభారంతో నిండి ఉంది. ఆమె కురులు తైల సంస్కారశూన్యాలై చెదరియున్నాయి. నొసలంతా స్వేదకణాలతో నిండి ఉంది. నీరసంగా "పరిస్థితులు తారుమారవుతున్నాయి. మా అన్నయ్య నాకు సంబంధాలు చూస్తున్నాడు మన వివాహం నీకిష్టంలేదా మనోహర్? మనఃపూర్వకంగా చెప్పు నేనంటే నీకు ప్రేమే లేదా!" అంది కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ

మనోహర్ ఆమెమాటలకు విచలితుడయ్యాడు. కాస్సేపు మౌనంగా ఉండి అన్నాడు "కరుణా, నామనసెరిగీ నీవితంగా ఆందోళనపడుతున్నావంటే ఆశ్చర్యంగా ఉంది. నామాటనమ్ము - రేపే మదరాసు వెడుతున్నాను. నా తల్లిదండ్రులకు మన వివాహంగురించి నచ్చచెప్పుతాను. మీ అన్నగారితో మాట్లాడమంటాను: మా నాన్న నా మాటత్రోసివెయ్యడు. నీవేమి బాధపడకు." అంటూ ఓదార్చాడు.

కరుణకాతని మాటలతో కాస్త ధైర్యం కలిగింది. "ఏమో మనోహర్ నిన్నే నమ్ముకున్నాను. నీకే నా హృదయమిచ్చాను. నామనస్సులోని ఆందోళన నీతో తప్ప ఎవరితో చెప్పుకోగలను! త్వరగా మీ నాన్నగారి నొప్పించుమనోహర్! మన జీవితాలు ఒక్కటి చెయ్యి." అన్నది తల వంచుకుని.

♦ ♦ ♦

సరిగ్గా సంవత్సరం క్రితం ఒకనాటి మధ్యా

హ్నం కరుణ తన గదిలో కూర్చుని కిటికీ లోంచి వీధిలోకి చూస్తోంది. నాలుగు నెలలుగా తాళం తగిల్చియున్న ఎదురింటిలో ఎవరో మసలుతున్నట్లయి ఆమె ఆయింటి వైపు చూసింది.

సావిట్లో గోడకు తగిలించిన అద్దంలో ముఖంచూచుకుంటూ తల దువ్వుకుంటున్నాడు ఓయువకుడు. కరుణ అతనెవరో చూడాలనుకుంది. అరగంటసేపు తల దువ్వి పాంటు షర్టు వేసుకొని ఆడించుకుంటూ గుమ్మంలో నిల్చున్నాడతడు. కరుణ అతని జూడగానే ఎందువలనో రోమాంచిత అయింది. సిగ్గుకలిగింది. అప్రయత్నంగా తలవంచుకుంది. ఇదివరకు ఎందరు యువకుల్ని చూడలేదు తను! కాని యీతనిలో ఏదో ప్రత్యేకత ఉందనుకుంది కరుణ. అదిమొదలు కరుణ చాటు మాటుగా అతని సురూపాన్ని చూడనారంభించింది. యీ సంగతి కనిపెట్టి ఆయువకు నెమ్మదిగా చూపులుకలిపాడు. అతడే మనోహర్.

కాలం గడచినకొద్దీ ఇరువురూ పరస్పరం ఆకర్షితులయ్యారు. మాటాడుకోవటానికి తహతహపడ్డారు. ఏకాంతంకోసం తపించిపోయారు. అదృష్టంకలసి కరుణ తల్లి చుట్టాలింటికి వెళ్ళడం, అన్నగారికి తాలూకాఫీసు గుమాస్తాగిరిలో తీరికలేక పోవడం వారికి అనుకూలించాయి. ఒకరి కౌగిలికి ఒకరు అంకితమైనారు. ఒకరి చేతులలో నొకరు ప్రమాణాలు చేసుకున్నారు "నీవు లేనిదే నేనుజీవించలేను. అగ్ని సాక్షిగా నిన్ను వివాహమాడతాను" అన్నాడు మనోహర్ "నిన్నుతప్ప నేనెవరినీ ప్రేమించలేను. నీవే నాజీవితం" అంది కరుణ. వారిప్రేమకు, పరమావధియైన వివాహంకోసం ఇరువురూ ఎదురుతెన్నులు చూస్తూ ఇంతవరకూ కాలంగడిపారు.

◆ ◆ ◆

మదరాసు వెళ్లిన మనోహరు కోసం దినాలూ, వారాలూ ఎదురుచూచింది కరుణ. ఆరునెలలు గడిచినా మనోహరు అంతు చిక్కలేదు. "ఎంతకుటిలాత్ముడు! హృదయపూర్వకంగా ప్రేమించానన్నాడే? నమ్మించి మోసంచేసాడు." అని మనస్సు స్థిరపరచుకుంది కరుణ.

చివరకు అన్నగారు నిశ్చయించిన సంబంధానికే కరుణకు వివాహం జరిగింది. కరుణకి మదరాసులో ఏదోప్రైవేటు కంపెనీలో పని. పెళ్ళయిన తరువాత నెలరోజులకే కరుణ భర్తతో మదరాసు వెళ్ళిపోయింది. క్రొత్త కాపురం. కరుణకు అంతా క్రొత్తగా ఉంది. అయినా చెయిదిరిగిన గృహిణిలాగ ఇంటిని దిద్దడానికి పూనుకుంది. వంట చెయ్యడం ఆమెకు క్రొత్తగాదు. ఆమెచేతిలో కళ ఉంది. ఇల్లంతా మంచిమంచి బొమ్మలతో పటాలతో ఆమె అలంకరించింది.

కరుణ అంటే ఆమె భర్త రాజుకు అమితప్రేమ. అతడుకోరుకున్న స్త్రీ లభించింది. విద్యలో, ఇంటి పనులలో, మాత్రమే గాక రూపంలో, సంగీతంలోగూడ కరుణ ఎవరికి తీసిపోదు. అతనిప్రేమకు ఆమె పాత్రురాలయింది. అట్టి భర్తను సమకూర్చిన దైవానికి ధన్యవాదాలను అర్పించుందామె. తను నమ్మిన భర్తను స్వర్గానందంలో

తేలుస్తూ ఆమె మనోహర్‌ను పూర్తిగా మరచిపోయింది.

ఆదివారం సినిమాకు వెళ్ళడం వారి కలవాటు: కరుణ ముస్తాబయింది. ఇద్దరూ "కల్యాణ పరిశు" సినిమాకువెళ్ళారు. హాలులో భర్తప్రక్కన ఎవరో కూర్చొని మాట్లాడుతున్నారు. ఆ కంఠస్వరం ఆమెకు పరిచితమైనదిగాతోచింది. ఎవరా అని చూచింది. "మనోహర్" ఆమె గుండెల్లో గాలివాన బయల్దేరింది. సినిమాచూస్తోందే కాని ఆమెమనస్సు ఇక్కడలేదు. సినిమా వదిలేసారు. హీరోచూపించిన త్యాగం నిజంగా ప్రపంచంలో ఎవరైనా చూపించగలరా అనుకుంది.

హాలుబయట తనకొరకు ఎదురుచూస్తూ నిలబడిన రాజు వద్దకు వచ్చింది. అతని ప్రక్కనే మనోహర్ నిలబడియున్నాడు. ఆతడు తనను గుర్తిస్తాడేమోనని భయంతో అటువైపు తిరిగి అవగుంఠనం వేసుకుంది. ఇంతలో రాజు మనోహర్‌తో "ఈమే నా భార్య, కరుణాదేవి" అంటూ పరిచయం చేసాడు.

మనోహర్ ఆమెను చూచి గతుక్కుమన్నాడు, "నమస్కారం" అన్నాడేగాని అదినూతిలో గొంతుకులా, ఉంది, ధారాళంగా, రాలేదు. ఆమె ప్రత్యభివాదనం చెయ్యడమే మరచిపోయింది. రాజుకు వీరిద్దరి ప్రవర్తనావింతనిపించింది.

ప్రతిరోజూ కరుణకు ఒక యుగంగా గడుస్తోంది. తనకు మనోహర్‌కు గల పూర్వపు సంబంధం తెలిస్తే తన గతి ఏమవుతుంది? మనోహర్ తన భర్తలేని సమయంలో వచ్చి బలవంతం చేస్తే - బెదిరిస్తే తనగతి ఏమిటి ? తనకెవరు దిక్కు. కరుణకు యీ వ్యథతో నిద్రాహారాలు కరువయ్యాయి. ఏనాటికైనా తనవిషయం బయట పడటం తథ్యమని, తమ అనురాగమయ దాంపత్యంలో విషబిందువు చిలుకుతుందని ఆమె నిశ్చయించుకుంది.

కరుణ రోజురోజుకు చిక్కిపోవడం, ఎప్పుడూ పరధ్యానంగా ఉండడం రాజుకు ఆశ్చర్యమయింది. ఆఫీసునుండి ఇంటికి వచ్చేసరికి ప్రేమతో ఎదురేగి పలుకరించే కరుణ రానురాను మాటాడడం కూడా తగ్గించడంతో రాజుకు విషయమేమి తెలియక బాధగా ఉండేది. ఏక్షణంలో భర్త ఏ విషయాన్ని ప్రస్తావిస్తాడో అని ఆమె భయపడసాగింది.

పదిహేను రోజులు గడిచాయి. నీరసంతో ఆమె జబ్బునపడింది. ఒకనాటి మధ్యాహ్నం రాజుతో మనోహర్ కూడా వచ్చేడు. మంచంమీద చిక్కి సగమైపోయి ఉన్న కరుణను చూడగానే అతని హృదయం కలుక్కుమంది. సతతం ప్రసన్నంగా ఉండే ఆమె ముఖపద్మం ముకుళించుకుపోయి ఉంది. ఆమె దీనపుచూపులు అతనికి ఏదో స్ఫురింప జేసాయి.

"పదిరోజుల్నించి ఆమె అన్నమే తినడంలేదు. ఎప్పుడూ పరాకుగానే ఉంటుంది. మనసులో ఏముందో చెప్పదు. ఏమీలేదని తేల్చేస్తుంది మనోహర్" అన్నాడు. విచారంగా రాజు.

"ఏం చెల్లీ! మా వాణ్ణిలా బాధపెడితే ఎలా చెప్పు. నిన్ను పెళ్లాడింది-వాడు బాధపడడానికా! మనసులోని కోరికేమిటో

చెప్పితే తీరుస్తాడుకదా చెల్లీ!" అన్నాడు నవ్వుతూ మనోహర్.

"చెల్లీ" అన్న సంబోధన ఆమెకు కొద్ది మనశ్శాంతి కల్గించింది. "నన్ను క్షమించు భగవంతుడా! ఈ దీనురాల్ని క్షమించు" అని మనస్సులో అనుకుంటూ గట్టిగా కళ్లు మూసుకుంది.

ఇంతలో రాజు కొరకు ఆఫీసునుంచి ప్యూనువచ్చి మేనేజరుగారు అర్జెంటుగా రమ్మంటున్నారని చెప్పాడు. కరుణకు ఈ పూట మందులేదు. ఉదయం మందు వేళ తప్పుతోంది. రాజుకు ఏమీ పాలుపోలేదు. "మనోహర్! దయయుంచి డాక్టర్ ఎంబెరుమాళ్ గారింటికి వెళ్ళి మందు తెచ్చి పెట్టు: టైంలేదు. నేను ఆఫీసుకు వెళుతున్నాను. కరుణా! జాగ్రత్త" అంటూ వెళ్ళిపోయాడు రాజు.

నెమ్మదిగా మనోహర్, ఆమెను సమీపించాడు. అతని కంఠం రుద్ధమైంది. "చెల్లీ నీ మనోవ్యథ నాకర్థమైంది. నిన్ను ఒకప్పుడు ప్రాణసమానంగా ప్రేమించిన మనోహర్ అంత మూర్ఖుడని, దుర్మార్గుడని అనుకోవద్దు. నీతో మాటాడిన మరుసటిరోజే ఇక్కడికి వచ్చాను. నా తల్లిదండ్రులతో మన వివాహం విషయమై చెప్పాను. వారు సుతరాం అంగీకరించలేదు. ఎంతగానో పోట్లాడేను. కాని ఫలితం దక్కలేదు. నా జీవితంమీద నాకే విసుగు జనించింది. ఇల్లు వదలి విశాలప్రపంచంలోనికి పారిపోయ్యాను. గత ఎనిమిది నెలలుగా తిరిగి తిరిగి మానాన్న మరణించాడని తెలిసి నెలరోజుల క్రితం ఇక్కడికి వచ్చాను. ఇక మన వివాహానికి ఎటువంటి అడ్డంకులు లేవని ఎంతో సంతోషంతో మీ వూరు వెళ్ళాను. అప్పటికే నీ వివాహమైపోయిందని, భర్తతో కలిసి వెళ్ళిపోయావని తెలిసింది. విధి బలీయమైపోయింది.

పచ్చని నీ సంసారంలో చిచ్చుపెట్టేటంత నీచుణ్ణికాదు చెల్లీ! ఎన్నటికి కాను. నీవైనా సుఖంగా ఉండటమే నాకు కావలసింది. నీ సుఖంకోసం నేను ప్రాణాలయినా అర్పిస్తాను. నావల్ల నీకెన్నడూ అపకారం జరుగుతుందని కలలోగూడా తలచవద్దు. లే, చెల్లీ. లేచి కూర్చో. పూర్వం నీ పెదవులపై విరిసిన చిరునవ్వు మరొక్కమారు నన్ను చూడనియ్యి" అంటూ చెమర్చిన కళ్లు తుడుచుకున్నాడు మనోహర్.

కరుణ లేచికూర్చుంది. ఆమె కళ్లు ఆనందంతో మిలమిల మెరుస్తున్నాయి. ఆమె హృదయంలో ముసురుకున్న అనుమాన మేఘాలు పటాపంచలయ్యాయి.

"అన్నయ్యా! నీదెంత ఉదాత్త హృదయం. నిన్ననుమానించినందుకు నన్ను క్షమించు" అంటూ కరుణ నవ్వింది.

డాక్టరు కే. యన్. కేసరిగారి

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాదమ్స్ స్టాల్సులో దొరుకుతుంది